
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
సోమవారం 22 జూలై 2024



పేదల ఇళ్లపై.. జగన్ కపట ప్రేమ

- లే అవుట్లలో సదుపాయాలు కల్పించడంలో విఫలం
- కేంద్రం నిధులు ఖర్చు చేయకుండా.. రూ.750 కోట్లు మురగబెట్టిన వైనం
- దాదాపు 70 వేల పేదల ఇళ్లకు గ్రహణం
- కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో చిగురిస్తున్న ఆశలు

కడప(కలెక్టరేట్), జూలై 21: సగటు మనిషి జీవితంలో ఇల్లు కట్టుకోవడం అనేది సవాలుతో కూడుకున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు గూడు కల్పించే విధంగా నిధులు కేటాయించడం ఒక బాధ్యత. ఇపుడున్న ఇసుక, ఐరన్, సిమెంట్ ధరలతో పాటు కూలీల డిమాండ్‌తో పేదలకు ఇళ్లు కట్టుకోవడం గగనమే. కేంద్రం ఇచ్చే నిధులు సరిపోక పోతే రాష్ట్ర వాటాగా నిధులు పెంచడమో, దాతలు, స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పేదల ఇంటి కలను నెరవేర్చడం పాలక ప్రభుత్వాల విధి. అయితే గత జగన్ ప్రభుత్వం ఊకదంపుడు ప్రచారాలు, ప్రగల్భాలతో కాలం గడిపింది. చివరకు ఇళ్ల నిర్మాణాల్లో చతికిల పడింది. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలింది. రాష్ట్రంలో నూతనంగా కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో ఇళ్ల నిర్మాణాలపై పేదలు గంపెడాశతో ఎదురు చూస్తున్నారు.

జగన్ అధికారం చేపట్టగానే నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు అనే పథకానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 434 లేవుట్లలో సెంటు, సెంటున్నర స్థలాలను మాత్రమే పేదలకు అంటగట్టి అబ్బో అనిపించారు. ఏకంగా జిల్లాలో 1.04 లక్షల ఇళ్లు మంజూరు చేసి పేదల ప్రభుత్వం అంటూ ధూంధాం ప్రచారాలతో హోరెత్తించారు. కేంద్రంలోని మోదీ సర్కారు ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షల చొప్పున జిల్లాకు వందలాది కోట్లు కేటాయించింది. అయితే నాలుగేళ్లుగా జగనన్న కాలనీల్లో వసతుల కోసం చేసిన పనులకు కాంట్రాక్టర్లకు కోట్లాది రూపాయల బిల్లులు ఎగనామం పెట్టడంతో మిగిలిన పనులు చేయకుండా వారు చేతులెత్తేశారు. దీంతో ఆ లేఅవుట్లన్నీ సౌకర్యాలు లేక చతికిలపడ్డాయి.

ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని పేదలు


పేదలు ఒక్కో ఇళ్లు కట్టాలంటే రూ.5, 6 లక్షలతో ఖర్చవుతుందని ముందుకు రాలేదు. ఇలాంటి సమయంలో కేంద్రం ఇచ్చే నిధులు సరిపోక పోతే పేదలకు బాసటాగా ప్రభుత్వం నుంచి కొంత నిధులు వెచ్చించి ఇళ్లు కట్టించాల్సింది పోయి, నయ్యాపైసా సాయం విదిల్చకుండా పేదల ఇంటి కలను కళగానే నాలుగేళ్లు నాన్చుడు ధోరణి ప్రదర్శించిన ఘనత జగన్ సర్కారుకు దక్కింది. దీంతో కేంద్రం పేదల ఇళ్లకు వెచ్చించిన కోట్లాది నిధుల్లో మన జిల్లాకు సంబంధించి సుమారు. రూ.750 కోట్లు ఖర్చు కాకుండా మూలనపడ్డాయి. జగన్ సర్కారు రాజకీయ స్వార్థ ప్రయోజనాలకు జిల్లా వ్యాప్తంగా 70వేల మంది పేదల ఇళ్లు బలి కావడం చూస్తే కపటప్రేమకు సాక్షీ భూతంగా చెప్పవచ్చు.

సిమెంట్, స్టీల్, ఇసుక ధరలు పెంచి...

గత జగన్ సర్కారు పేదలపై కనికరం లేకుండా తన అనుయాయుల ప్రయోజనాల కోసం భూముల కొనుగోలు నుంచి స్వంత సిమెంట్ కంపెనీలకు లాభం చేకూర్చేలా.. ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు అమాంతంగా పెంచి జోరుగా వ్యాపారం సాగించారు. సిమెంట్ ధరలు గతంలో ధరలకంటే అధికంగా మూటపై 70 నుంచి వంద రూపాయిల భారం రుద్దారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో సిమెంట్ బస్తా ధర రూ.280-300 వరకు ఉండగా, అదే సిమెంట్‌ను ఏకంగా రూ.380 నుంచి రూ.400 వరకు ధరలు పెంచి పేదల ఇళ్లపై మరింత ఆర్థిక భారం మోపారనే విమర్శలు ఉన్నాయి. అదే రీతిలోనే గతంలో టన్ను స్టీల్ ధరలు 40-50 వేలుగా ఉండగా... జగన్ సర్కారులో ఏకంగా టన్ను ఐరన్ ధర రూ.67 వేల వరకు చేరుకోవడం చూస్తే.. పేదల ఇళ్లే టార్గెట్‌గా పెద్ద బిజినెస్ జరిగిందని చెప్పవచ్చు. పేదలకు బాసటగా, ఉదారంగా సాయం చేయాల్సిన గత జగన్ ప్రభుత్వం అధిక ధరలతో పేదల ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగడం గగనమైంది.

70 వేల మంది పేదల ఇళ్లకు శాపం

జగన్ సర్కారు కొలువుదీరిన వెంటనే నవరత్నాల పథకం కింద జిల్లాలో 1.04 లక్షల పేదల ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు ఏక కాలంలో చేశారు. పేదలకు ఇళ్లంటూ నిత్యం ఊదర గొడుతూ సచివాలయాల సిబ్బందిని, రెవెన్యూ, హౌసింగ్ సిబ్బందిని అధికారులు పరుగులు పెట్టించారు. ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు చేస్తామని బెదిరింపులకు దిగారు. కూలీనాలీ చేసుకొని కుటుంబాలను వెళ్లదీసే పేదలు ఇళ్లు నిర్మించుకోక పోతే రద్దు చేస్తారనే భయంతో... వడ్డీలకు తెచ్చి బేస్ మట్టాలు, స్లాబ్ వరకు నెట్టు కొచ్చారు. లే అవుట్లలో సౌకర్యాలు లేక పోగా.. కేంద్రం ఇచ్చే రూ.1.50 లక్షలు చాలక, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.30వేలతో పాటు బ్యాంకు రుణం మరో రూ.30 వేలు కలిపి మొత్తం రూ.2.10 లక్షలతో ఇళ్లు పూర్తి చేయాలి. రూ.5,6లక్షలతో నిర్మించే ఇళ్లకు నిర్మాణం చేస్తే అప్పుల పాలవుతామని ముందుకు సాగని పరిస్థితి. దీంతో జగన్ సర్కారు జిల్లాలో మంజూరు చేసిన 1.04 లక్షల ఇళ్లకు నాలుగేళ్లలో పేదలు కట్టుకున్న ఇళ్లు కేవలం 31 వేలే... మిగిలిన 73వేల మంది పేద లబ్ధిదారుల ఇంటి కల అధిక ధరలు, సౌకర్యాలు లేని లేఅవుట్లలో డబుల్ ధరలతో ఇంటి పనులు చేయించే స్థోమత లేక ఇంటి ఆశలు అడియాసలయ్యాయి.



మొండిగోడలతో దర్శనమిస్తున్న జగనన్న ఇల్లు

సొంత స్థలాల్లోనే నిర్మాణాలు ఎక్కువ

జగనన్న కాలనీలు, ఊర్లక్షు ఊర్లంటూ ఊక దంపుడు ప్రచారాలతో పేదల ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టారు. పేదలకు ఇళ్లు నిర్మించి తాళం చేతిలో పెడతానంటూ జగన్ మాటలపై పజలకు లేని పోని ఆశలు కల్పించారు. అయితే జగనన్న కాలనీల పేరుతో 434 లేఅవుట్లలో 66 వేల ఇళ్ల నిర్మాణాలు చేపడితే అందులో కేవలం 11 వేలకు మించి నిర్మాణాలు జరగలేదు. ఇక పోతే స్వంత స్థలాల్లో 26 వేల మందికి ఇళ్లు మంజూరు కాగా.. దాదాపు 20వేల మంది వరకు తమ స్వంత ఖర్చులు వెచ్చించి నిర్మించుకోవడం గమనార్హం. దీంతో మాజీ సీఎం సొంత జిల్లాలో అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు కసరత్తు చేసి జిల్లా మొత్తంలో నాలుగేళ్లలో 31 వేల గృహాలు పూర్తి చేయడం గగనమైంది..



ప్రొద్దుటూరు బొల్లవరం కాలనీలో పునాదులకే పరిమితమైన జగనన్న ఇళ్లు

ఇందులో మరో ట్విస్ట్ ఏమిటంటే పేదలు ఇళ్లు కట్టుకొనే స్థోమత లేదని.. పక్క జిల్లాల నుంచి పెద్ద పెద్ద కాంట్రాక్టర్లను రంగంలో దింపారు. దాదాపు 21 వేల ఇళ్లు అన్ని మున్సిపాలిటీల పరిధిలో పూర్తి చేస్తామంటూ ప్రగల్భాలు పలికి కేవలం 600 ఇళ్లు పూర్తి చేసి పేదల ఆశలపై నీళ్లు చల్లారు.

ఉచిత ఇసుకతో ఊరట

పేదలు ఇళ్లు నిర్మాంచుకునేందుకు వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీని అమలులోకి తెచ్చారు. దీంతో గతంలో ఒక ఇంటి నిర్మాణానికి సుమారు 6 ట్రాక్టర్లు అవసరం అయ్యేది. ఆ ఇసుకను కొనాలంటే ట్రాక్టర్ ఇసుకకు రూ.6వేలు చొప్పున రూ. 36వేల వరకు భరించాల్సిందే. అలాంటి పరిస్థితిని, పేదల ఇబ్బందులు తెలుసుకున్న చంద్రబాబు ఉచిత ఇసుక పాలసీతో ఒక్కో లబ్ధిదారునికి రవాణా ఖర్చులు, కూలీలు పోనూ రూ.25-వేల నుంచి రూ.30 వేల వరకు లబ్ధి చేకూరనుంది. అంతే కాకుండా వర్షాకాలం కావడంతో నిర్మాణ రంగం కొంత స్పీడ్ తగ్గనుండడంతో ఇపుడున్న అధిక ధరల కంటే సిమెంట్, స్టీల్ ధరలు 10 శాతం వరకు తగ్గే అవకాశాలున్నాయి. దీంతో పేదల ఇళ్ల నిర్మాణాలకు ఈ ప్రభుత్వ హయాంలో కొంత ఆర్థిక వెసులు బాటు కలగనుంది.

గృహనిర్మాణ బడ్జెట్‌కు కొదవ లేదు

- కృష్ణయ్య, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్

జిల్లాలో పేదల ఇళ్ల నిర్మాణ పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపులకు బడ్జెట్ పుష్కలంగా ఉంది. గత ఏడాది నుంచి కేంద్రం జిల్లాకు కేటాయించిన బడ్జెట్ ఇంకా రూ.750 కోట్లు సిద్ధంగా ఉంది. ఇళ్లు వేగవంతగా నిర్మించే లబ్ధిదారులకు ప్రతి వారం బిల్లులు చెల్లిస్తున్నాం. పేదల ఇళ్లకు ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక పాలసీ ఆర్థిక తోడ్పాటు అందించనుంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రణాళికలతో ముందుకు వెళ్లనున్నాం. ప్రతి పేదవాడు ఇల్లు నిర్మంచుకోవడమే లక్ష్యంగా పని చేస్తాం.

ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన సాయిబాబా ఆలయాలు



కడపలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు

జిల్లావ్యాప్తంగా ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. గురు పౌర్ణమి సందర్భంగా ఆదివారం వేకువజామునే సాయిబాబాను ఆలయ పూజారులు ప్రత్యేక పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచి ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున సాయిబాబాను దర్శించుకున్నారు. ఆలయ కమిటీల నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

- కడప



ట్రిపుల్‌ఐటీల్లో 4400 సీట్ల భర్తీకి శ్రీకారం



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అడ్మిషన్ ప్రక్రియ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త

- నేటి నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ
- 27 వరకు అడ్మిషన్లు

వేంపల్లె, జూలై 21: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ట్రిపుల్‌ఐటీల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ఆరు సంవత్సరాల సమీకృత ఇంజనీరింగ్ కోర్సు కోసం అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల్లో 4400 సీట్లు భర్తీ చేయనున్నారు. ఈ నెల 22 నుంచి 27 వరకు ఆయా ట్రిపుల్ ఐటీల్లో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించేందుకు కౌన్సెలింగ్ కన్వీనర్ అమరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఒక్కో ట్రిపుల్‌ఐటీలో 1100 మంది విద్యార్థులకు అడ్మిషన్ కల్పించనున్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో సెంట్రల్ లైబ్రరీలో డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆధ్వర్యంలో అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే అధ్యాపకులకు, సిబ్బందికి కౌన్సెలింగ్‌పై అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే విద్యార్థినీ విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో ప్రవేశం కల్పించేందుకు అన్ని సిద్ధం చేసినట్లు డైరెక్టర్ గుప్త తెలిపారు. ఇడుపులపాయకు సంబంధించి ఇడుపులపాయ క్యాంపస్‌లో 22, 23 తేదీల్లో, నూజివీడు ట్రిపుల్ ఐటీకి సంబంధించి అదే క్యాంపస్‌లో 22, 23 తేదీల్లో జరుగుతాయి. ఒంగోలు ట్రిపుల్‌ఐటీలో చేరే విద్యార్థులకు 24, 25 తేదీల్లో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్ కౌన్సెలింగ్ జరుగుతుంది. శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలో చేరే విద్యార్థులకు 26, 27తేదీల్లో శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లోనే ఈ అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. ఇప్పటికే ఆయా విద్యార్థులకు కాల్‌లెటర్లు పంపారు. వెబ్ సైట్‌లో చూపించిన విధంగా ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఇతర ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని అధికారులు తెలిపారు. కాగా ఇడుపులపాయలో అడ్మిషన్ కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఆర్జీయూకేటీ చాన్సిలర్ ప్రొఫెసర్ కేసిరెడ్డి హాజరవుతారు.

వైభవంగా కోదండరాముడి కల్యాణం

ఒంటిమిట్ట, జూలై 21: ఏకశిలా నగరి కోదండరామాలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులైన సీతారాములను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండపం వద్ద కల్యాణతంతును ప్రారంభించారు. ముందుగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, అనంతరం యజ్ఞోపవితరణ నిర్వహించి వైష్ణవ సంప్రదాయంలో వేదపండితులు సీతమ్మ తల్లికి మాంగల్యధారణ చేయించారు. అనంతరం తలంబ్రాల సమర్పణ, పూలచెండుల మార్పిడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ వ్యాఖ్యాత గానుగపెంట హనుమంతరావు భక్తులకు సీతారాముల కల్యాణం విశిష్ట సందేశాన్ని తెలియజేశారు. కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్దఎత్తున భక్తులు విచ్చేశారు.



కల్యాణం అనంతరం ఆశీనులైన సీతారాములు

గండికోటను సందర్శించిన కలెక్టర్

జమ్మలమడుగు, జూలై 21: పర్యాటక ప్రాంతమైన గండికోటను ఆదివారం కలెక్టర్ లోతేటి శివశంకర్ సందర్శించారు. ముందుగా కలెక్టర్ జుమ్మా మసీదు ప్రాంగణం, ధాన్యాగారం, కత్తుల కోనేరు, లోయ ప్రాంతం సందర్శించారు. మాధవరాయస్వామి దేవాలయం, రాజులకాలం నాటి కారాగారం, పావురాల మండపం, గుర్రపుశాల షెడ్డు తదితర వాటిని పరిశీలించారు. గండికోట కాలంనాటి కట్టడాలు పరిశీలించి... స్థానికులతో, ఆర్కియాలజీ డిపార్టుమెంట్‌తో మాట్లాడారు. రోప్‌వే ఆగిపోవడంపై ఆరా తీశారు. గండికోట స్వదేశీ దర్శన్‌లో ఎంపిక కావడం, కేంద్ర ప్రభుత్వ నిధులతో గండికోట పర్యాటక ప్రాంతం అభివృద్ధి పనులకు సంబంధించి మాట్లాడారు. కాగా జిల్లా కలెక్టర్ పర్యాటక ప్రాంతాన్ని సందర్శిస్తున్నా ఆర్డీవో కార్యాలయ సిబ్బందికానీ, అధికారులు కానీ మీడియాకు సమాచారం ఇవ్వలేదు. అలాగే స్థానికంగా ఉన్న సర్పంచ్‌కు సైతం సమాచారం తెలుపలేదని తెలిసింది. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీటీ వేణు, సర్పంచ్ గురుఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



గండికోట మసీదు వద్ద స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

కన్నుల పండువగా రథోత్సవం

- గోవింద నామంతో మార్మోగిన నందలూరు



రథాన్ని లాగుతున్న భక్తులు

నందలూరు, జూలై 21: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. ఆలయ అర్చకులు సునీల్‌శర్మ బృందం ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల నడుమ భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామిని ప్రత్యేకంగా అలంకరించి రథోత్సవాన్ని ముందుకు కదిలించారు. రథోత్సవానికి పెద్దఎత్తున హాజరైన భక్తుల గోవిందనామస్మరణలతో మాడవీధులు మార్మోగాయి. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. మన్నూరు సీఐ మంజునాథరెడ్డి, ఎస్ఐ అబ్దుల్ జహీర్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పోలీసులతో భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పెద్దఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, ప్రముఖ నటుడు, దర్శకుడు తోట వేణుగోపాల్, రాజంపేట మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యెద్దల విజయసాగర్, గంటా వాసుదేవయ్య, పల్లె సుబ్రమణ్యం, జంగంశెట్టి సుబ్బయ్య, చక్రాల రామసుబ్బన్న, మోడపోతుల రాము, ఉప్పుశెట్టి రెడ్డయ్య, బోయలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు. రాజంపేట రీజెన్సీ నలందా విద్యాసంస్థల అధినేత జీవన్ నాయుడు ఆధ్వర్యంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయులు స్వాతి, ఏవో శివ, విద్యార్థుల పర్యవేక్షణలో రథోత్సవానికి విచ్చేసిన దాదాపు 2 వేల మందికి అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు.



రథోత్సవం ముందు కోలాటం

బుర్రకథ కళాకారిణి లక్ష్మిదేవికి సినిమా ఛాన్స్

- పవన్‌కళ్యాణ్ సినిమాలో పాటపాడే అవకాశం

లక్కిరెడ్డిపల్లె, జూలై 21: లక్కిరెడ్డిపల్లెకు చెందిన బుర్రకథ కళాకారిణి లక్ష్మీదేవికి పవన్ కళ్యాణ్ నటించబోవు ఓజీ సినిమాలో పాట పాడడానికి అవకాశం దక్కింది. ఈనెల 14వ తేదీ ఆహా టీవీలో సీజన్-3 ఇండియన్ తెలుగు ఐడల్ కార్యక్రమంలో భాగంగా 'గ్రామవాసులు జానపదగేయాలు' కార్యక్రమంలో పాల్గొన్న ఆమె సుండుపల్లె సంతకు పోయి సున్నాలు తెస్తావా అనే జానపద గేయం పాట పాడింది. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ ఆ పాటను మెచ్చుకుని మెమెంటోతో పాటు నగదు అందజేసి అభినందించారు. అంతేకాకుండా పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించబోవు ఓజీ అనే సినిమాలో పాట పాడే అవకాశం కల్పిస్తున్నట్లు కూడా సంగీత దర్శకుడు తమన్ సభావేదిక మీద ఆమెకు చెప్పినట్లు టీటీడీ అన్నమయ్య సంకీర్తన హార్మోనిస్ట్ మహదేవ తెలిపారు. లక్ష్మీదేవి బుర్రకథలు, రేడియోలో జానపదగేయాలు ఆలపించేది. శుభకార్యాలకు బుర్రకథలు చెప్పేది. రేడియో సంపాదకులు జయసింహ సహకారంతో ఆహా టీవీలో వస్తున్న తెలుగు ఐడల్ కార్యక్రమంలో పాల్గొని పాటలను ఆలపించింది. దీంతో గాయకురాలు గీతామాధురి, సంగీత దర్శకుడు తమన్ చేతుల మీదుగా ప్రశంసలు అందుకోవడంతో పాటు సినిమాలో పాట పాడే అవకాశం దక్కింది.



తమన్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న లక్ష్మిదేవి

 7

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటయ్యేనా?

తల్లిదండ్రుల ఆశలు నెరవేరేనా? పదేళ్లుగా ప్రతిపాదనలతోనే....

పోరుమామిళ్ల, జూలై 21: పురుషులతో సమానంగా అవకాశాలను అందిపుచ్చుకుంటున్న నేటి సమాజంలో ఇప్పటికీ మహిళలు దూరంగా వెళ్లి చదువుకోవాలంటే అనేక రకాల ఇబ్బందులు తప్పడంలేదు. మహిళలకు ప్రత్యేకించి డిగ్రీ కళాశాల కేటాయించక పోవడంతో కొందరు మధ్యలోనే చదువును నిలిపేస్తున్నారు. అనేక గ్రామాలకు కేంద్ర బిందువైన పోరుమామిళ్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేస్తే గ్రామీణ మహిళలు మరింత ఉన్నత చదువు చదివే అవకాశం ఉంది. వివరాల్లోకెళితే...

నేటి సమాజంలో విద్యార్థులతో సమానంగా విద్యార్థినులు ఏ మాత్రం తీసిపోనీకుండా చదివించడంలో తల్లిదండ్రులు వెనుకాడడంలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో దూరంగా చదివించాలంటే కొందరు ఆలోచన చేస్తున్నారు. అందుబాటులో ఉండే విద్యా సంస్థలైతే తమకు అనుకూలంగా ఉంటాయని సాయంత్రం కల్లా ఇంటికి చేరుస్తారనే దీమా వారిది. పోరుమామిళ్లలో ప్రైవేటు ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలలు కూడా ఉన్నాయి. కలసపాడు, కాశినాయన, బికోడూరు మండలాల్లోని గ్రామీణులు వేలాది మంది విద్యార్థులు, విద్యార్థినులు విద్యాభ్యాసం కోసం పోరుమామిళ్లకు వచ్చి వెళుతుంటారు. కానీ అబ్బాయిలకు డిగ్రీ వరకూ అవకాశాలున్నాయి. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోఎడ్యుకేషన్ ఉన్నప్పటికీ అమ్మాయిల తల్లిదండ్రులు అంత దూరం పంపాలంటే కాస్త ఆలోచిస్తున్నారు. మహిళా డిగ్రీకళాశాల ఉంటే అనుకూలంగా ఉంటుంది కదా అనే ఆలోచనలు కూడా వారిలో తలెత్తాయి. చాలామంది విద్యార్థులు ఉండి కూడా ఆర్థిక పరిస్థితి లేని వారు ఇంటర్ చదువుకే స్వస్తి పలుకుతున్నారు. ఆర్థిక స్థోమత కలిగిన వారు నెల్లూరు, విజయవాడ, గుంటూరు, తిరుపతి తదితర ప్రాంతాలకు పంపి పిల్లలకు విద్యాభ్యాసం చేయిస్తున్నారు. మధ్యతరగతి పేదవర్గీయులు మాత్రం చదివిన కాడికి చాల్లే తమ పరిస్థితి ఇంత వరకే చదివిద్దాం అని సర్దుకుపోతున్నారు. దీంతో దాదాపు వందలాది విద్యార్థినులు ప్రతిభ ఉండీ విద్యను కొనసాగించ లేకపోతున్నారు. పదేళ్ల కిందట పోరుమామిళ్లలో



మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని యూనివర్శిటీ అధికారికి వినతిపత్రం అందిస్తున్న పోరుమామిళ్ల వాసులు (ఫైల్)

మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు పుర ప్రముఖులు, పెద్దలు కలిసి కలెక్టరు, ఆర్‌జేడీకి ప్రతిపాదనలు పంపారు. యూనివర్శిటీ వీసీ వినతిపత్రాలు అందించారు. కానీ స్థల సమస్య ఏర్పడడంతో ఆలోచనలో పడ్డారు. దాదాపు రెండున్నర ఎకరాలో ఉండే కళాశాల, హాస్టల్‌కు రెండూ వసతులు కల్పించేందుకు వీలుగా ఉంటుందని అంచనాలు వేశారు. అప్పట్లో ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనుక వైపున దాదాపు రెండున్నర ఎకరాలు స్థలం కేటాయించేందుకు నిర్ణయాలు తీసుకున్నా ఆ స్థలం ఎవరు రిజిస్ట్రేషన్ చేయిస్తారనేది ప్రశ్నగా మారింది. కళాశాల మైదానం, ఎనిమిదెకరాలకు పైగా ఉన్న ఆ ప్రాంతంలో కళాశాల వెనుక వైపున అయితే బాగుంటుంది, ఊరికి మధ్యలో ఉంటుందని, విద్యార్థినులకు సెక్యూరిటీగా అనుకూలంగా ఉంటుందనే అంచనాలు వేసినా కార్యరూపం దాల్చలేకపోయింది. అప్పటి రాజకీయ పరిణామాలు, స్థలం రిజిస్ట్రేషన్ చేయించేదెవరు అన్న ప్రశ్నలు స్థానికుల్లో తలెత్తినా ప్రయత్నాలు మాత్రం కొనసాగించారు. ప్రతిసారీ ప్రజాప్రతినిధుల దృష్టికి ఈ విషయం తీసుకెళుతున్నా కార్యరూపం దాల్చేలా ఎవరూ ముందుకు రాలేదు. ఫలితంగా చాలా మంది గ్రామీణ విద్యార్థులు ఇంటర్‌తోనే స్వస్తి పలుకుతూ తమ భవిష్యత్తు ఇంటర్‌లోనే నిలిపివేస్తున్నారు. ఎవరైనా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని ప్రభుత్వ స్థలాల్లో మహిళా డిగ్రీకళాశాలకు స్థలం కేటాయించేలా కళాశాల నిర్మాణం జరిగేలా నిధుల కోసం అధికారులు, నేతలతో చర్చించి కార్యరూపం దాల్చేలా చర్యలు తీసుకుంటే పోరుమామిళ్ల పరిసర ప్రాంత బాలికలకు అనుకూలంగా ఉన్నత విద్య చదివేందుకు అవకాశం ఇప్పించినవారవుతారు. మరి పెరుగుతున్న జనాభాకనుగుణంగా ఈ ప్రాంతం చుట్టుపక్కలకు కేంద్ర బిందువుగా నిలిచింది. ఈ ప్రాంతంలో ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాల ఏర్పాటైతే ఎందరో బాలబాలికలకు ఉన్నతవిద్యనందించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసే అవకాశం ఉంది.

మహిళా కళాశాల కోసం ప్రయత్నాలు చేశాం



పోరుమామిళ్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనక వైపు స్థలం కేటాయించేందుకు అప్పట్లో అధికారులతో మాట్లాడాం. మహిళా డిగ్రీ కళాశాలకు హాస్టలు వసతికి దాదాపు రెండున్నర ఎకరా స్థలం అవసరం అవుతుందని అంచనా వేశారు. పోరుమామిళ్లలో మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటైతే బాలికలకు ఉన్నత విద్య అందుతుందని అప్పటి కలెక్టరు, ఆర్‌జేడీకి ప్రభుత్వ డిగ్రీకళాశాలకు వచ్చిన అధికారులకు వినతి పత్రాలు కూడా అందించాం. స్థల సేకరణే ప్రశ్నగా మిగలడంతో ఎవరూ ముందుకు రాలేదు.

- గురుమూర్తి, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రభుత్వం మారిందీ...

జగన్, రాచమల్లు ఫొటోలే పెడతారా ! ● ఇది మున్సిపల్ కార్యాలయం... మీ ఇల్లు కాదు

నందం సుబ్బయ్యను చంపినప్పుడు బీసీ మాటెత్తలేదే... ● రాజన్న క్యాంటిన్ ఎప్పుడు తెరుస్తారు ?

వైసీపీ చైర్‌పర్సన్ వైస్‌చైర్మెన్ల ఆరోపణలపై భగ్గుమన్న టీడీపీ కౌన్సిలర్లు



సమావేశంలో మాట్లాడుతున్న కౌన్సిలర్ వంగనూరు మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 21: "ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చెల్లుచీటి ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 45 రోజులు దాటుతున్నా ఇంకా మున్సిపల్ కార్యాలయంలో సీఎం, ఫొటోను మార్చలేదు. ఇది మున్సిపల్ కార్యాలయం మీఇల్లు కాదు. నందం సుబ్బయ్యను చంపినప్పుడు బీసీలు గుర్తుకు రాలేదా, పేదల కోసం రాజన్న క్యాంటిన్ ఏర్పాటు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు ఎప్పుడని" టీడీపీ కౌన్సిలరు వంగనూరు మురళీధర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆదివారం స్థానిక కొర్రపాడు రోడ్డులోని మురళీధర్‌రెడ్డి కార్యాలయంలో కౌన్సిలర్లు వైఎస్ మహ్మద్‌గౌస్, మునీర్, మాజీ కౌన్సిలర్ జంబాపురం రామాంజనేయరెడ్డితో కలిసి మాట్లాడుతూ ప్రభుత్వం మారినా మున్సిపల్ చైర్‌పర్సన్ చాంబర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకుండా మాజీ సీఎంలు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ఫొటోలు పెట్టడంపై అభ్యంతర పెడితే టీడీపీ దౌర్జన్యం చేస్తోందని, బీసీ మహిళా చైర్‌పర్సన్‌ను అవమాన పరుస్తోందని ప్రజలను తప్పుదోవ పట్టించే ఆరోపణలు చేయడంపై టీడీపీ కౌన్సిలర్లు భగ్గుమన్నారు. చైర్‌పర్సన్ చాంబర్ అనేది ప్రభుత్వ కార్యాలయం అని వైసీపీ ఆఫీసు కాదని, మీ ఇల్లు అంతకన్నాకాదని గుర్తుంచుకోవాలన్నారు. బీసీ నేత నందం సుబ్బయ్యను దారుణంగా చంపినప్పుడు, ఎమ్మెల్సీ రమేష్‌ను బెదిరించినప్పుడు గుర్తుకు రానీ బీసీ పదం మాజీ సీఎం, మాజీ ఎమ్మెల్యేల ఫొటోలు ఇంకా ఎలా ఉంచుతారని ప్రశ్నించినందుకు చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, వైస్ చైర్మెన్ బంగారురెడ్డికి బీసీ పదం గుర్తుకు రావడం హాస్యాస్పదమన్నారు. మూడేళ్లలో కౌన్సిల్‌లో ఆమోదించడమైనది, తిరస్కరించడమైనది అనే రెండు మాటలు తప్ప స్వతంత్రంగా మరో మాట మాట్లాడారా అని ప్రశ్నించారు. బావా బామర్దులు రాచమల్లు, బంగారురెడ్డి బీసీ చైర్‌పర్సన్‌గా మీకు విలువ ఇచ్చారా అని ప్రశ్నించారు. మూడేళ్లలో ఒక్కరోజైనా చైర్‌పర్సన్‌గా ఒక్క కౌన్సిలర్‌కు లెటర్ ఇవ్వడం, అధికారులతో సమావేశం నిర్వహించడం, పట్టణంలో స్వతంత్రంగా తిరగడానికి మీకు వారు అనుమతినిచ్చారా అని ప్రశ్నించారు. మా దేవుడు ఫొటో తొలగిస్తారా అని మాట్లాడిన చైర్‌పర్సన్ లక్ష్మీదేవికి రాచమల్లు దేవుడైతే మీ ఇంట్లో పెట్టుకుని పూజలు చేసుకోండన్నారు. కడప కార్పొరేషన్‌లో మాజీ సీఎం జగన్ ఫొటోలున్నాయని చెబుతున్నారు. అక్కడ మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా ఫొటో ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ కార్యాలయంలోనూ ఎమ్మెల్యేల ఫొటోలు లేవన్నారు. అలా ప్రభుత్వ ఉత్తర్వులు లేవన్నారు. ఎన్నికలతో సంబంధం లేకుండా మా అన్న ఆజ్ఞతో 11 ఏళ్లు రాజన్న క్యాంటిన్ ద్వారా పేదలకు అన్నం పెడతానని చెప్పిన రాచమల్లు ఎన్నికలు అయిపోయినా ఎందుకు తెరవలేదన్నారు. ప్రజలు రాచమల్లు ఏర్పాటు చేసే రాజన్న క్యాంటిన్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. మా నాయకుడు సీఎం సురేష్‌నాయుడు ఎన్నికల వరకు అన్నాక్యాంటిన్ పెడతామని, ఆ తరువాత మా ప్రభుత్వం అన్నా క్యాంటిన్‌లు పెడుతుందని చెప్పారన్నారు. కూరగాయల మార్కెట్ ప్లాన్ బాగుందని మా నాయకుడు కొండారెడ్డి చెప్పాడని అందులో జరిగిన అవినీతి గురించి ఇంకా మాట్లాడలేదన్నారు. మార్కెట్ నిర్మాణం కాక ముందే కాంట్రాక్టర్ నుంచి రాచమల్లు పర్సెంటేజీలు తీసుకున్నారని ఆరోపించారు. తాత్కాలిక మార్కెట్‌లో రూ.5కోట్లు దోచుకున్నారని ఎక్కడైనా ప్రమాణం చేస్తానన్నారు. ఏ బండ, ఏ గది ఎంతకు అమ్ముకున్నారో చెబుతామన్నారు. రాచమల్లు ప్రమాణాలకు అనర్హుడని బంగారురెడ్డి, చైర్‌పర్సన్ లక్ష్మీదేవి ప్రమాణానికి ముందుకు రాగలరా అని సవాల్ విసిరారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి

బి.కొత్తకోట, జూలై 21: ఇంటి ముందున్న నీటి సంపులో పడి బాలుడు నిఖిలేష్(2) మృతి చెందాడు. ఆదివారం బి.కొత్తకోటలో జరిగిన సంఘటనపై వివరాల్లోకెళితే.... బాబా టాకీస్ వీధికి చెందిన బాబు కుమారుడు ఆడుకుంటూ వెళ్లి ఇంటి ముందున్న నీటి సంపులో పడిపోయాడు. కుటుంబీకులు గమనించకపోవడంతో నీటిలో పడి మృత్యువాత పడ్డాడు.

నేడు గండి క్షేత్రంలో టెండర్లు

చక్రాయపేట, జూలై 21: సోమవారం ఉదయం 10 గంటలకు గండి వీరాంజనేయస్వామి కార్యాలయంలో దేవస్థానం ఆవరణలో పూలు విక్రయం, దేవస్థానంలో టోల్‌గేట్ వసూలుకు టెండర్లు పిలవనున్నట్లు సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఒక్కో దానికి రూ.5లక్షలు డిపాజిట్ కట్టి పాటలో పాల్గొనాలని కోరారు. శ్రావణమాసం లో పుష్పాలంకరణ, విద్యుత్ అలంకరణ, స్వాగత తోరణాలు, చలువపందిళ్లు, బారికేడ్లు, ఫొటోలు, వీడియోలు రికార్డు చేసి ఇచ్చేందుకు, భజంత్రీ లు ఏర్పాటుకు సీల్డ్ టెండర్లు పిలవనున్నట్లు ఆయన తెలిపారు. కావున ఆసక్తి ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొనాలని కోరారు.



హోర్డింగ్ చిరిగి వేలాడుతున్న దృశ్యం

చిరిగిన ఫ్లెక్సీ తీగలపై పడితే....

ఎర్రగుంట్ల, జూలై 20: ఎర్రగుంట్ల నాలుగురోడ్ల కూడలి వద్ద ఓ ప్రైవేట్ వ్యాపార సంస్థ మూడంతస్తుల బిల్డింగ్‌పై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ (హోర్డింగ్) చిరిగిపోయింది. గాలికి కొట్టుకుంటుండడంతో బారీగా శబ్దం వస్తోంది. గాలికి ఎగిరి కిందపడితే దీని వల్ల ప్రమాదం పొంచి వుంది. ముఖ్యంగా వాహనాలు నడిపేవారిపై పడితే వాహనాలు డీకొట్టుకునే ప్రమాదం లేకపోలేదు. విద్యుత్ వైర్లపై పడితే కూడా ప్రమాదం ఉందని, వెంటనే దానిని తీసివేయాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

లెజెండరీ, నంది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

కడప(మారుతీనగర్), జూలై 21: వివిధ రంగాల్లోని ప్రతిభావంతులు, విశేష సేవలందిస్తున్న ప్రముఖులను 2024 సంవత్సరానికి గుర్తించి వారికి ఆగస్టు 10న లెజెండరీ, బంగారు నంది పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించనున్నట్లు అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఎస్.సరోజనమ్మ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ భారత ప్రధాని రాజీవ్‌గాంధీ 80వ జయంతి, ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్మారక దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో పురస్కారాల ప్రదానోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. సంగీత, నృత్య, చిత్రలేఖనం, అలంకరణ, ఇంద్రజాలం, క్రీడలు, నటన, విద్య, వైద్యం, వాస్తు, జాతకాలు, సామాజిక సేవలు, సాహిత్య, జానపద రంగాలకు చెందిన వారితోపాటు కవులు, కళాకారులు, సంఘ సంస్కర్తలు, సినీ, టీవీ కళాకారులు, దర్శక, నిర్మాతలు, రంగస్థల కళాకారులు, న్యాయవాదులు, ఫ్యాషన్ డిజైనింగ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, ఇతర రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వారు పూర్తి వివరాలతో 30లోగా దరఖాస్తులను 6302908528, 9705313061 నెంబర్లకు వాట్సాప్ ద్వారా పంపాలన్నారు. అవార్డు గ్రహీతల ఎంపికలో న్యాయ నిర్ణేతలదే అంతిమ నిర్ణయమని తెలిపారు.

వ్యక్తిపై దాడి - కేసు నమోదు

కడప క్రైం, జూలై 21: కడప నగరం ఎర్రముక్కపల్లె రైల్వేగేట్ సమీపంలో నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు ఒకరిపై దాడి చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. సికెదిన్నె మండలం పెద్ద ముసల్‌రెడ్డిపల్లె వాసి బాలకృష్ణారెడ్డి సొంత పని నిమిత్తం 18న ద్విచక్ర వాహనంలో కడపకు వస్తుండగా ఎర్రముక్కపల్లె సమీపంలో నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి దాడి చేసినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు. గాయపడ్డ వ్యక్తికి వారి బంధువులకు భూ వివాదం ఉండడంతో దాడి చేసింటారని అనుమానిస్తున్నారు.

ఆహ్లాదకరంగా సాగుతున్న స్కౌట్ శిక్షణ



శిక్షణ కార్యక్రమం దృశ్యం

కడప (స్పోర్ట్స్) జూలై 21: హజ్మాడి స్కౌట్ హాలులో ఏడు రోజుల పాటు జరుగుతున్న స్కౌట్ బేసిక్ శిక్షణలో భాగంగా మూడోరోజు ఆదివారం జిల్లాలోని కబ్, స్కౌట్, రోవర్ మాస్టర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. శిక్షణకు సుమారు 60 మంది ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఇందులో ప్రధానంగా స్కౌట్ ప్రాధాన్యత, ప్రధాన ఉద్దేశాలు, ఉపయోగాలు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శిక్షణానంతరం ఉపాధ్యాయులు వారి వారి పాఠశాలల్లో యూనిట్‌ను ఎలా నిర్వహించాలి తదితర విషయాలను పూర్తిగా వివరించారు. కార్యక్రమంలో స్కౌట్ కార్యదర్శి ప్రమీల, స్కౌట్ అసోసియేషన్ ట్రెజరర్ శివశంకర్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, జిలానిబాష, ఖాదర్ బాష, లక్ష్మీకర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పాల వ్యాపారి మృతి

వల్లూరు జూలై 21: కడప తాడిపత్రి జాతీయ రహదారి సత్యాగ్రీన్ సిటీవద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని పాలవ్యాపారి ప్రసాద్‌రెడ్డి (46) మృతి చెందినట్లు వల్లూరు ఏఎస్‌ఐ మోహన్‌రావు తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు పెండ్లిమర్రి మండలం కొండూరు వాసి కడపలో నివాసం వుంటూ రోజూ వల్లూరు మండలానికి వచ్చి ఇంటింటా పాలు సేకరించి కడపలో అమ్ముకునేవాడని తెలిపారు. ఆ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున పాలు పట్టుకునేందుకు వస్తుండగా సత్యాగ్రీన్ సిటీ వద్ద గుర్తు లెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడి కక్కడే చనిపోయాడని తెలిపారు. ఘటనా స్థలికి ఎస్‌ఐ కత్తి వెంకటరమణ వచ్చి ప్రమాదానికి గల కారణాలు, వివరాలను అడగి తెలుసుకున్నారు. అనంతరం శవాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి అన్ని కోణాల్లో కేసు దర్యాప్తు చేపడతామని తెలిపారు.

'ఈగల్ డిస్టిలరీస్'పై విజిలెన్స్ తనిఖీ

కడప క్రమ్, జూలై 21: చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల సమీపంలోని ఈగల్ డిస్టి లరీస్ ఫ్యాక్టరీ (మద్యం తయారీ కేంద్రం)లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం తనిఖీ చేపట్టింది. 16 గంటల పాటు అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అధికారులు సోదాలు చేపట్టారు. రికార్డులు స్టాక్ వివరాలు, గోడౌన్ తరలింపు వివరాలను పరిశీలించారు. మద్యం తయారీ కేంద్రంలో 9సి హార్స్ విస్కీ బ్రాండ్‌లను తయారు చేస్తారు. అధికారులు మద్యాన్ని శాం పిల్ తీసి మంగళగిరిలోని ల్యాబ్‌కు టెస్టింగ్ కోసం పంపించారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు తనిఖీ చేసినట్లు తెలుస్తోంది. ఈ తనిఖీల్లో కడప విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఈదుర్‌బాషా,ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కృష్ణకుమార్, డిస్టిలరీస్ సీఐ తులసి పాల్గొన్నారు.

విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనివి



షాలోమ్ అనాథాశ్రమంలో పుస్తకాలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలుటౌన్, జులై 21: విద్యాదాత సానపురెడ్డి గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనిదని మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన కుమారులు సానపురెడ్డి రామగోపాల్‌రెడ్డి, రాధాక్రిష్ణారెడ్డి సహకారంతో షాలోమ్ అనాథాశ్రమంలోని పిల్లలకు మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి నుంచి రూ.25వేలు విలువైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఏపీ పెన్షనర్స్ సంఘంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఆయన మాట్లాడుతూ సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ఉద్యోగం చేస్తూ, ఇంటికి వచ్చిన తరువాత ఇంటి వద్ద పేదపిల్లలకు ఉచితంగా విద్యాబుద్దులు నేర్పించి ఆదర్శప్రాయుడయ్యారన్నారు. గ్రామంలో ఆలయ నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తుండేవారన్నారు. కార్యక్రమంలో ఏపీ పెన్షనర్స్ సంఘం అసోషియేట్ అధ్యక్షుడు డాక్టర్ మీనాక్షిరెడ్డి, పలువురు విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

శిక్షణ ఇవ్వరు - మిషన్లు పంపిణీ చేయరు

'ఐకేపీ'లో నిరుపయోగంగా 60 కుట్టుమిషన్లు



పెనగలూరు ఐకేపీ కార్యాలయంలో నిరుపయోగంగా ఉన్న కుట్టు మిషన్లు

పెనగలూరు, జూలై 21: మండల పరిధి నిరుద్యోగ ద్వారా మహిళలకు ఉపాధి కల్పించే నిమిత్తం ఏపీ ఎండీసీ మంగంపేట ప్రాజెక్టు ఆధ్వ ర్యంలో పెనగలూరు ఐకేపీ కార్యాలయానికి 60 కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. అయితే ఎన్నికలకోడ్ సాకుతో నాలుగు నెలలుగా 60 కుట్టుమిషన్‌లు ఐకేపీ కార్యాలయంలో మూలనపడి తుప్పు పట్టిపోతున్నాయి. ఇదిలా ఉండగా శిక్షణకు ఎన్నిక చేసిన 60 మంది నిరుద్యోగ మహిళలు శిక్షణ కోసం, కుట్టు మిషన్ల పంపిణీ కోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

ఎన్నికలు ముగిసి ఫలితా లు వెలువడి, ఎన్నికల కోడ్ కూడా ముగిసి నెలన్నర కావస్తున్నా ఐకేపీ కార్యాలయంలో కుట్టు మిషన్ల శిక్షణ గురించి కాని, పంపిణీ చేసే కార్యక్ర మం కానీ జరగలేదు. ఇదిలా ఉండగా ఎన్నికల కోడ్ రాక ముందు 20 రోజులు కోడ్ వస్తుందనగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొం దూరు అజయ్‌రెడ్డి ద్వారా ఐకేపీ ఏరియా కోఆర్డినే టర్ నిరంజన్‌కుమార్ శిక్షణకు శ్రీకారం చుట్టారు.

మళ్లీ ఏమైందో ఏమోగానీ ఐదు రోజులకే ఎన్ని కలకోడ్ సాకుతో శిక్షణను నిలిపేశారు. అప్పటి నుంచి మూడు నెలలుగా శిక్షణ కార్యక్రమం పూర్తి గా ఆగిపోయింది. ఐకేపీ కార్యాలయంలో కుట్టు మిషన్ల గురించి పట్టించుకున్న పాపాన పోలేదన్నా రు. నిరుద్యోగుల కోసం మంజూరు చేసిన కుట్టు మిషన్లు కూడా ఇచ్చామంటే ఇచ్చామ న్నట్లు నాణ్యత లేని మిషన్లు అని కొద్ది రోజు లు శిక్షణకు వెళ్లిన మహిళలు ఆరోపిస్తున్నారు.

కొన్ని నెలలుగా మిష న్లు మూలన పడి ఉండగా తుప్పు పట్టిపోతున్నాయని అంటున్నా రు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పెనగలూరు ఐకేపీ కార్యాలయంలో నిరుప యోగంగా ఉన్న కుట్టుషన్ల శిక్షణ, పంపిణీపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతు న్నారు. ఈ విషయంపై ఏసీ, ఏపీఎం నిరంజ న్‌కుమార్‌ను వివరణ కోరగా కుట్టు శిక్షణకు ఎంపిక చేసిన మహిళల జాబితాను ఏపీఎం డీసీ వెబ్‌సైట్‌కు ఆన్‌లైన్‌లో పంపించాము. ఎన్నికల కోడ్ రావడంతో తాత్కాలికంగా ఎన్నికల కమిషన్ నిలు పుదల చేసిందని తదుపరి శిక్షణ ఉత్తర్వు లు ఇంకా రాలేదని, ఏపీఎండీసీ ఆదేశాలు రాగానే వెంటనే శిక్షణ, కుట్టుమిషన్ల పంపిణీ చేపడతామన్నారు.

ఆనందాన్నిచ్చిన పుష్పగిరి క్షేత్ర దర్శనం

తాళ్ళపాక అన్నమాచార్య వంశస్తులు నారాయణాచార్యులు



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న నారాయణాచార్యులు, భక్త బృందం

వల్లూరు, జూలై 21: ప్రసిద్ధి గాంచిన పుష్పగిరి క్షేత్రాన్ని దర్శించడం ఎంతో ఆనందాన్ని కలగజేసిందని తాళ్ళపాక అన్నమాచార్య వంశీకులు నారాయణాచార్యులు అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి ఆహ్వానం మేరకు నారాయణాచార్యులు పుష్పగిరి క్షేత్రానికి వచ్చారు. దేవాలయం వారు వారిని ఘనంగా ఆహ్వానించారు. అనంతరం లక్ష్మీచెన్నకేశవ, సంతాన మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆలయ మర్యాదలతో అర్చకులు ఘనంగా సన్మానించారు. అర్చకులు పుష్పగిరి క్షేత్రం మహత్యాన్ని ఆయనకు వివరించారు. అనంతరం స్థానిక భక్తులతో కలిసి టెంకాయలు కొట్టి హారతి అందించి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నారాయణాచార్యులు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణతో సకల శుభాలు కలుగుతాయని, భక్తులు ఏక కాలంలో శివకేశవులను దర్శించడం ఒక భాగమైతే దిగువన ప్రవహిస్తున్న పంచమనదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఈ హరిహర వేద క్షేత్రాన్ని దర్శిస్తే అన్ని కోరికలు నెరవేరుతాయన్నారు. గిరి ప్రదక్షిణ చేయడం వలన ప్రతి ఇంటా శుభాలు జరుగుతాయన్నారు. వీరి వెంట భారవి, బసిరెడ్డి, టీటీడీ బృందం, విశ్వనాథరెడ్డి, ఆలయ అర్చకులు అఖిల్, సుమంత్ దీక్షితులు, భక్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఈబీ దాడులు

రెండు రోజుల్లో ఆరు ట్రాక్టర్లు పట్టివేత - జరిమానా విధింపు



ఇసుక ట్రాక్టర్లతో ఎస్ఈబీ సీఐ మ హేష్ కుమార్ సిబ్బంది

ప్రొద్దుటూరు, జూలై 21: పట్టణంలో నిరాటంకంగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఈబీ అధికారులు రెండు రోజులుగా దాడులు నిర్వహించారు. లింగాపురం, సీతంపల్లె సహా పలు ప్రాంతాల్లో జరిపిన దాడుల్లో 6 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ట్రాక్టర్లకు రూ.54 వేలు జరిమానా విధించినట్లు ఎస్ఈబీ సీఐ మహేష్‌కుమార్ తెలిపారు. ఎస్పీ, ఏఎస్పీ ఆదేశాలతో 12 మందితో స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటైందని, ఎప్పుడైనా ఎక్కడైనా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే దాడులు చేసి పట్టుకుంటారన్నారు. ప్రొద్దుటూరు ఎస్ఈబీ పరిధిలో ప్రొద్దుటూరు, రాజుపాళెం, చాపాడు మండలాలు వున్నాయని కానీ ఎస్ఐ, సీఐ సహా ఐదుగురు కానిస్టేబుల్స్ వుంటారన్నారు. సిబ్బంది కొరత వల్ల పూర్తి స్థాయిలో ఇసుక అక్రమ రవాణా నియంత్రించలేకపోతున్నామన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యతను ఇవ్వాలి



మాట్లాడుతున్న డీఎస్పీ మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21: చదువుతోపాటు క్రీడలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ మురళీధర్ విద్యార్థులకు సూచించారు. ఆదివారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో దేవాంగ కల్యాణ మండపంలో నిర్వహిం జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసిక దృఢత్వానికి దోహదపడతాయన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ కనపరిచినవారికి విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఉంటుందని ఆ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనపరచి పతకాలు సాధించాలన్నారు.

ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 180 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, సీనియర్, కేడెట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, కార్యదర్శి నాయబ్‌రసూల్, ఆర్గనైజర్ సలీం, బాష, రమేష్, తైక్వాండో అసోసియేషన్ నెల్లూరుజిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, అనంతపురం జిల్లా కార్యదర్శి సాయిబాబా, కర్నూలుజిల్లా కార్యదర్శి అబ్దుల్, కోచ్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి పూజలు






వేంపల్లెలో పూజలందుకుంటున్న సాయినాథుడు... సత్యనారాయణవ్రతంలో పాల్గొన్న భక్తులు... చెన్నూరు: పూజలందుకున్న షిరిడీ సాయిబాబా... అన్నప్రసాదం అందిస్తున్న పుత్తా సరళమ్మ

వేంపల్లెలో ఘనంగా గురుపౌర్ణమి

వేంపల్లె, జూలై 21: వేంపల్లెలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం సాయిబాబా మూల విరాట్‌కు అభిషేకం, హారతి, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంతో పాటు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం షిరిడీసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అధిక సం ఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

వేదవ్యాసుడు ఆదిగురువు : తులసిరెడ్డి

భగవాన్ వేదవ్యాస మహర్షి భారతీయ సమాజానికి ఆదిగురువని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ నేత తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో గురుపౌర్ణమి మహోత్సవాన్ని కాం గ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వేదవ్యాస మహర్షి నాలుగు వేదాలను సమాజానికి ఇవ్వడమే కాకుండా పంచమవేదంగా ప్రసిద్ధి గాంచిన సంస్కృత మహాభాగవతాన్ని, అష్టాదశ పురాణాలను, ఉపనిషత్తులను, బ్రహ్మసూత్రాలను అందించిన గురువరేణ్యుడన్నారు. పతంజలి యోగ శాస్త్రానికి ఆధారం వ్యాసమహర్షి చెప్పిన సూత్రాలే అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు అలివేలమ్మ, అమర్‌నాథరెడ్డి, ఉత్తన్న, వెంకటేశ్, వినయ్ పాల్గొన్నారు.

ఘనంగా గురపౌర్ణమి వేడుకలు

చెన్నూరు, జూలై 21: మండలంలోని పలు ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చెన్నూరు కేఓఆర్ కాలనీలోని సాయిబాబా గుడిలో, అలాగే బ్రాహ్మణవీధిలోని షిరిడీ సాయినాథుని ఆలయంలో, పడమటి వీధిలో సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా తెల్లవారుజామున సాయినాథునికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నప్రసాద వితరణ చేశారు. కేఓఆర్ కాలనీలోని ఆలయలంలో గాంధీరెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణతో పాటు లడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన కమలాపురం ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తల్లి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సతీమణి పుత్తా సరళమ్మ సాయినాథుని దర్శించుకుని అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు.

వల్లూరులో గురుపౌర్ణమి వేడుకలు

వల్లూరు, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రమైన వల్లూరులో గల షిరిడీ సాయిబాబా ఆలయలంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున హారతి అనంతరం పంచామృతాభిషేకాలతో అభిషేకరించారు. వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. భక్తులు కాయ, కర్పూరం చెల్లించి ముక్కులను తీర్చుకున్నారు. మధ్యాహ్నం వేళ భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాలను చేపట్టారు.




వల్లూరులో ప్రత్యేక అలంకారంలో సాయినాథుడు.. వీరపునాయునిపల్లెలో పూజలు అందుకుంటున్న సాయిబాబా

ప్రత్యేక అలంకారంలో సాయిబాబా

వీరపునాయునిపల్లె, జూలై 21: మండలంలోని ఎన్.పాలగిరి క్రాస్ వద్ద ఉన్న అవధూత కాశిరెడ్డినాయన, షిరిడీసాయిబాబా ఆలయాల్లో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలుఘనంగా జరిగాయి. ఆలయ ప్రాంగణంలో భజనలతో ఆలయాలు మారుమోగాయి. ముందుగా స్వామివార్ల మూలవిరాట్‌లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపించారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామివార్లను దర్శించుకొని తీర్థప్రసాదాలను అందుకున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లక్ష్మిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు




గోపాలపురంలో పూజలు అందుకుంటున్న కోదండరామయ్యస్వామి... కోలాటం చేస్తున్న కొండయ్య బృందం

సీకేదిన్నె, జూలై 21: చింతకొమ్మదిన్నె మండలంలో గురుపౌర్ణమి వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా బుసిరెడ్డిపల్లె పంచాయతీ గోపాలపురంలోని అవధూత కోదండరామయ్య స్వామి ఆరాధన ఎంతో ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం అందించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.భక్తులకు భారీగా అన్నదానాలు నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో భక్తులకు కోలాటంతో కనువిందు చేశారు. అదే విదంగా సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రకృతినగర్‌లోని సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. గురజాల క్లీనిక్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అదే విధంగా రింగ్‌రోడ్డులో తేజా మెడికల్ షాపు వద్ద గంగమ్మ ఆలయం వద్ద ఉ న్న సాయిబాబా, ఊటుకూరులోని సాయిబాబా తదితర సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజ లు నిర్వహించి అన్నదానాలు నిర్వహించారు. నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 21: జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛభారత్, గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమాశేశంలో మాట్లాడారు. జిల్లాలోని గ్రామాలలో, స్వచ్ఛభారత్ పంచాయతీ కార్మికులు తాతల ముత్తాతల కాలం నుంచి పనిచేస్తున్నారన్నారు. అలాంటి వారికి నెలల తరబడి వేతనాలు రాకపోవడం దారుణమన్నారు. గ్రామాల్లో పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో వీరి పాత్ర కీలకమన్నారు. వీరికి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాగా గ్రామాల్లో పనిచేస్తున్న కార్మికులకు తక్షణమే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొందరికి 8 నెలలు, 10 నెలలు, 12 నెలలుగా వేతనాలు రాకపోయినా పనిచేస్తున్నారని గుర్తుచేశారు. ఇప్పటికైనా గ్రామ పంచాయితీ జిల్లా అధికారులు త్వరితగతిన స్పందించి జీతాలు ఇవ్వాలని కోరారు.

డ్రోన్ వర్క్‌షాపును వినియోగించుకోండి

కడప (కల్చరల్), జూలై 21: ఏపీ ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్, కడప ఫోటో వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24న స్థానిక యర్రముక్కపల్లెలోని సీపీ బ్రౌన్ లైబ్రరీలో డ్రోన్ వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉద్యమ సంఘానికి ఊతమివ్వండి: యూటీఎఫ్

కడప ఎడ్యుకేషన్, జూలై 21: ప్రభుత్వ విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పరమావధిగా ఆవిర్భవించిన యూటీఎఫ్ యాభై వసంతాలు పూర్తి చేసుకుని విద్యా, వైజ్ఞానిక సదస్సులతో స్వర్ణోత్సవానికి సిద్ధమవుతున్నా ఉద్యమ సంఘానికి ఊతమివ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ భవనంలో మహా సభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అధికారంలో ఏ ప్రభుత్వం ఉన్నా యూటీఎఫ్ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు. ఈ సభల ద్వారా ఉపాధ్యాయుల్లో ఉద్యమ స్ఫూర్తిని నింపడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహారావు, ఎజాస్ అహమ్మద్, చంద్రశేఖర్, గోపినాథ్, కృష్ణారెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్ఎం శ్రీవాణి

కడప ఎడ్యుకేషన్, జూలై 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందజేస్తున్న రుణాలను ప్రజలు సద్వినియోగం చేసుకోసుకోవాలని ఆ బ్యాంకు రీజినల్ మేనేజర్ శ్రీవాణి, కిశోర్‌కుమార్, ఏజీఎం శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్‌బీఐ మన్సూన్ మ్యాజిక్ పేరుతో హౌస్‌లోన్ మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 20,21 తేదీల్లో హౌసింగ్ మేళా ద్వారా ప్రజలకు లోన్‌లపై అవగామన కల్పిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 30 తేదీ వరకు జరిగే ఈ మేళాలో రుణానికి సంబంధించి ప్రాసెసింగ్ ఫీజు రద్దు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అధికారులు సురేష్ బాబు, నగర ప్రముఖులు బిల్డర్‌లు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

'నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలి'



మాట్లాడుతున్న సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్, జూలై 21: డిపార్టుమెంటల్ పరీక్షల్లో సులభతరంగా ఉత్తీర్ణత సాధించాలంటే నిబంధనల పట్ల అవగాహన పెంచుకోవాలని జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఎన్‌జీఓ సంఘం జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు.ఆదివారం కడప నగరం ఎన్‌జీఓ హోంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో డిపార్టుమెంటల్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు, సులభంగా ఉత్తీర్ణత, ఎలా సాధించాలో వివరించారు. ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్, చెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఉపయోగకరమైన డిపార్టుమెంట్ పరీక్షల ప్రశ్నావలిని బ్లాక్‌బోర్డుపై వివరించారు. ప్రధానంగా పించన్ నింబంధనలు, ట్రెజరీ నిబంధనలు భారత రాజ్యంగంపై పట్టు పెంచుకుంటే 141 కోడ్ పేపర్‌లో సులభతరంగా ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. అలాగే మరికొన్ని నిబంధనలపై వివరించారు. ఏపీటీఎఫ్ నాయకులు ఉమాకాంత్, ఈశ్వర్‌చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యోగ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువు ఆశీర్వాదాలు పొందడం పూర్వజన్మ సుకృతం

కడప (కల్చరల్), జూలై 21: గురువు ఆశీర్వాదాలు పొందడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బి.రామ్ మహేష్ పేర్కొన్నారు. గురుపౌర్ణమి పర్వదినం సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం నగర పాతబస్టాండు సమీప వీహెచ్‌పీ కార్యాలయంలో లలితా పీఠం పీఠాధిపతి తురీయానంద సరస్వతి స్వామివారి పాదపూజ చేసి ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణమఠం పీఠాధిపతులు అనుపామానంద స్వామిజీ, అమ్మాయమ్మ గారి మఠం పీఠాధిపతులు సప్రేమానంద స్వామి, విహెచ్‌పి నగర సహ కార్యదర్శి మోహన్‌రెడ్డి, సురేంద్ర, సంజీవరాజు, అమర్‌రెడ్డి తదితరులు పాలొన్నారు.

జిల్లాలో భూ కబ్జాలపై విచారణ జరపాలి

● రౌండ్ టేబుల్ సమావేశంలో నేతల డిమాండ్



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 21: జిల్లా భూ కబ్జాలపై విచారణ జరపాలని భూ పోరాట సాధన కమిటీ కన్వీనర్ బి.నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నేత చంద్రశేఖర్, సీపీఐ నేత సుబ్రమణ్యం, కాంగ్రెస్ నేత సత్తార్, బీఎస్‌పీ నేత గుర్రప్ప మాట్లాడుతూ భూకాబ్జాలు పేట్రేగిపోయాయన్నారు. ఒంటిమిట్ట మండలం జోకులపల్లె రెవెన్యూ పొలంలో మూడు వేల ఎకరాలు పెన్నా పేరూరు రెవెన్యూ పొలం సర్వేనెంబర్ 661లో వందల ఎకరాలు భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. సిద్దవటం మండలం నాయకులు, కడప ప్రజా ప్రతినిధులు ఎస్టేట్‌లు ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ భూములను అనుభవిస్తున్నారని ఆరోపించారు. వీటిపై తక్షణం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అలీఖాన్, సీఐటీయూ నేత మనోహర్, హేతువాద సంఘం సిఆర్‌వి ప్రసాద్, రైతు సంఘం నేత దస్తగిరిరెడ్డి, వీహెచ్‌పీఎస్ నేత మునెయ్య, దళిత ఫోరం చైర్మన్ కిశోర్‌కుమార్, రాజేష్ పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

కమలాపురం రూరల్, జూలై 21: కర్తదానం మరొకరికి ప్రాణదానం అని డాక్టర్ తేజశ్రీ తెలిపారు. ఆధివారం రక్తోత్సవాల్లో భాగంగా కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు మదర్ తెరిస్సా సేవా సమితి, నెహ్రూ యువకేంద్ర సంయుక్త ఆద్వార్యంలో రక్తదాన శిభిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమినికి ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ తేజశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్న యువత మూడు నెలలకు ఒక్కసారి రక్తదానం చేయవచ్చునన్నారు. రక్తదానం చేయడం వలన పాత కణాలు పోయి కొత్త కణాలు రావడంతో ఎంతో ఆరోగ్యంగా ఉంటారన్నారు. ఏ ప్రయోగ శాలలోని తయారు అవ్వనిది రక్తం మాత్రమేనని అలాంటి రక్తాన్ని మనిషి మాత్రమే దానం చేయగలరన్నారు. అమ్మ జన్మనిస్తే రక్తదాత పునర్జన్మనిస్తారని కొనియాడారు. కర్తదానం చేయడం ద్వారా ఎన్నో ఆరోగ్య లాభాలు ఉన్నాయని ఆ లాభాలను గురించి అవగాహన కలిగి రక్తదానం చేసేందుకు యువత నడుం బిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెవీవీఎస్ వ్యవస్థాపకులు, మదర్ తె రిస్సా ట్రస్టు చైర్మెన్ విజయ్‌బాబు, అశోక్, శ్రీకాంత్, సుధీర్, కాశి, కొండారెడ్డి, రిమ్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల వితరణ

పులివెందుల టౌన్, జూలై 21: పట్టణంలోని ముద్దనూరు రోడ్డులోని వికలాంగుల కమ్యూనిటీ భవనంలో స్వర్గీయ రామతులశమ్మ 21వ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు 30 మంది దివ్యాంగులకు దుస్తులు వితరణ అం దించారు. ఆదివారం రామతులశమ్మ కుమారుడు డాక్టర్ రవీంద్రరెడ్డి ఆయన సతీమణి హరితలు వీటిని అందించినట్లు వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆధార్ స్పెషల్ క్యాంప్

పులివెందుల రూరల్, జూలై 21: పలు సచివాలయాల్లో 23 నుంచి ఆధార్ స్పెషల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చాలా మంది బయోమెట్రిక్ అప్‌డేషన్, డాక్యుమెంట్స్ అప్‌డేషన్‌పెండింగ్ ఉన్నందున ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తామన్నారు. 23న చెన్నారెడ్డి, నగరిగుట్ట సచివాలయాలు, 24న ప్రశాంతినగర్, వెంకటాపురం, 25న మిస్సమ్మ బంగ్లా, పెద్దకొండప్ప కాలనీ, 26న బాకరాపురం, ఉలిమెల్ల, 27న రాజీవ్‌కాలనీ సచివాలయాలలో క్యాంప్ ఉంటుందన్నారు.

గురుపౌర్ణమి సందర్భంగా అయ్యవారురెడ్డికి సన్మానం



అయ్యవారురెడ్డిని సన్మానిస్తున్న శిష్య బృందం

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా యోగా గురువులు పాలెంపల్లె అయ్యవారురెడ్డిని ఆయన శిష్యులు సన్మానించారు. ఈ సందర్భంగా అయ్యవారురెడ్డి మాట్లాడుతూ గత 26 ఏళ్లుగా కడపలో యాదాళ్ల రంగమ్మబాలికో న్నత పాఠశాలలో ఉచి తంగా యోగా నేర్పి స్తు న్నామన్నారు. యోగా శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. కం ప్యూటర్ యుగంలో ప్రతి మనిషికీ మానసిక ఆనందం కొరవడిందన్నారు. అనేక సమస్యలతో మనిషి సతమతమవుతుంటారని, ఉపశమనానికి యోగా అవసరమన్నారు.

విజయదుర్గమ్మకు వైభవంగా ఆషాడ పౌర్ణమి పూజలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ ధర్మకర్తలు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 21: కడప నగరం విజయదుర్గమ్మ వారి ఆలయంలో ఆషాడ పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయిని వేదపండితులు రాయిపెద్ది సుబ్బరాయ శర్మ తెలిపారు. ప్రతి సంవత్సరం జ్యేష్ఠ శుద్ధ విదియ మొదలు ఆషాడ పౌర్ణమి వరకు మండలం పాటు ఆలయంలో మండల దీక్ష, కలశ స్థాపన చేస్తారని తెలిపారు. అమ్మవారి మాలధారణ నిర్వహి స్తారని పేర్కొన్నారు. ఆషాడ పౌర్ణమి రోజున అమ్మవారికి ఇరుముడి సమర్పించి దీక్ష విరమిస్తారన్నారు. ఆషాడ పౌర్ణమి పర్వదినం సందర్భంగా యమున, గోదావరి, నర్మద, కావేరి, తుంగభద్ర, క్రిష్ణ మొదలైన పుణ్య నదీజలాలతో నింపిన కలశాలను మండలం పాటు విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

ఆర్కిటెక్చర్ యూనివర్సిటీలో అవినీతిపై స్పందించాలి: పీడీఎస్‌యూ

కడప ఎడ్యుకేషన్, జూలై 21: ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలకు ప్రజా ప్రతినిధులు స్పందించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అవినీతికి పాల్పడిన ప్రొఫెసర్ ఈసీ సురేంద్రనాథరెడ్డిని, మాజీ వీసీలు సూర్యకళావతి, చింతా సుధాకర్, మాజీ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేసి ఎలాంటి రోస్టర్, రిజర్వేషన్ పాటించకుండా ఎంపీ అవినాస్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి బావమర్ది కలిసి బంధువులు, అనుచరులకు లంచాలు తీసుకొని ఉద్యోగాలు ఇచ్చి డబ్బు దోచుకున్నారన్నారు. వీరిపై తక్షణం విజిలెన్స్, సీఐడీ, ఏసీబీతో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ముబారక్, బాషా, మనోజ్, మహేంద్రారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



తలిశెట్టి సుబ్రమణ్యం స్కూల్‌లో కలిసిన పదోతరగతి విద్యార్థులు

వేంపల్లె, జూలై 21: వేంపల్లె తలిశెట్టి సుబ్రమణ్యం బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1979 బ్యాచ్ విద్యార్థులు కలిశారు. దాదాపు 45 ఏళ్ల తర్వాత కలిసిన వీరికి వేంపల్లెలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వేదిక అయింది. ఈ సందర్భంగా తొలుత గురువులను సన్మానించారు. గురుపౌర్ణమి సందర్భంగా గురువులను సన్మానించారు. దివంగతులైనసహచరులను తలచుకొని వారి ఆత్మలకు శాంతి చేకూరాలని కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం చిన్ననాటి విషయాలను గుర్తుచేసుకున్నారు. మధ్యాహ్నం భోజనం అనంతరం తాము చదివిన పాఠశాలను సందర్శించారు. ఇందులో రెండు, మూడు రాష్ట్రాల్లో వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడిన వారు ఉండడం గమనార్హం.

కేంద్ర బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించాలి

● డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్

కడప (సెవెన్‌రోడ్స్), జూలై 21: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే బడ్జెట్ పార్లమెంట్ సమావేశాలలో ఈ సారైనా కడప ఉక్కుకు నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత పది సంవత్సరాలుగా విభజన హామీ అయిన కడప ఉక్కు పరిశ్రమను కేంద్రం పూర్తిగా విస్మరించిందన్నారు. కరువు, వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కలలగాలంటే కడప ఉక్కు పరిశ్రమే ఏకైక మార్గమన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా కడప ఉక్కు రాత మారడం లేదన్నారు. ప్రస్తుతం కడప ఉక్కుకు నిధులు రాబట్టే సమయం వచ్చిందని, కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం కీలకంగా ఉన్నందున కూటమి ప్రభుత్వం కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో కడప ఉక్కుపై ప్రస్తావించి అవసరమైన నిధులు రాబట్టాలన్నారు. కావున ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా ఈ ప్రాంత ప్రజల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

'ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలి'

త్వరలో జరగనున్న అసెంబ్లీ, పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలలో కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర విభజన సందర్భంగా అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లాకు ప్రభుత్వ రంగ పరిశ్రమను ఏర్పాటు చేస్తామని పార్లమెంట్ సాక్షిగా నాడు ప్రధాని నరేంద్రమోదీ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కావున ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని కోరారు. సమావేశంలో నగర అధ్యక్షులు నవీన్, పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు





ఎర్రగుంట్లలో బాబాను దర్శించుకుంటున్న భక్తులు, జమ్మలమడుగులో బాబా ఉత్సవ విగ్రహం ఊరేగింపు, ప్రొద్దుటూరులో పుష్పాలంకరణలో షిరిడీసాయిబాబా

ఎర్రగుంట్ల, జూలై 21: గురుపౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయాలకు భక్తులు వేలాదిగా పోటెత్తారు. స్వామివారిని దర్శించుకునేందుకు గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉన్నారు. సాయినగర్‌లోని బాబా ఆలయం, సుంకేసుల రస్తాలోని సాయిబాబా ఆలయం,చిలమకూరులోని బాబా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీపీపీలో అశ్వత్థనారాయణ స్వామికి కళ్యాణోత్సవం నిర్వహించారు. స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీచేశారు.

మైదుకూరు రూరల్‌..: మైదుకూరు పట్టణంలోని పాత,కొత్త సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి వేడుకలు భక్తులు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం వేకువజాము నుంచే ఆలయాలలో ప్రత్యేక పూజలు జరిగాయి. బాబాకు పంచామృతాభిషేకంతో పాటు మంగళహారతి ఘనంగా జరిగాయి. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. వేలాది మంది భక్తులు వేడుకలలో పాల్గొన్నారు.

కొండాపురం..: మండలంలో గురుపౌర్ణమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండలంలోని సాయిబాబా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.కొండాపురం, వెంకటాపురం, లావనూరు తదితర చోట్ల సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అదే విధంగా పౌర్ణమి సందర్భంగా చౌటిపల్లె కాశినాయన ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మైలవరం..: మండల పరిధిలోని బెస్తవేముల, మైలవరం, దొమ్మరనంద్యాల తదితర గ్రామాల్లో సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆలయ కమిటీల ఆధ్వర్యంలో భక్తులు గ్రామోత్సవాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

జమ్మలమడుగు..: జమ్మలమడుగులో గురుపౌర్ణమి మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో షిరిడీ జ్ఞానసాయిబాబా మందిరం, కోవెలకుంట్ల రోడ్డులోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ తాతిరెడ్డి తులసి, మాజీ వైస్‌ఛైర్మన్ తాతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వై.చెన్నారెడ్డి, శివారెడ్డి, పొన్నపురెడ్డి శివమ్మ, దొంతిరెడ్డి మాధవ నరసింహారెడ్డి, క్రిష్ణవేణి, పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. నాగులకట్టవీధి, సాయిబాబా ఆలయం తదితరచోట్ల భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు. పై ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం ముద్దనూరు రోడ్డు నుంచి షిరిడీ జ్ఞానసాయిబాబా వారి ఉత్సవ విగ్రహం పురవీధుల గుండా కోలాటం, మంగళవాయిద్యాలతో ఊరేగింపు చేశారు. మోరగుడి కోవెలకుంట్ల రోడ్డులోని సాయిబాబా ఆలయం వద్ద నుంచి మోరగుడిలో బాబా విగ్రహం ఊరేగింపు చేశారు.

అట్లూరు..: మండలంలోని తొండూరులో వెలసిన షిరిడి సాయినాథుని ఆదివారం గురుపౌర్ణమి వేడుకల భక్తులు ఘనంగా నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ప్రొద్దుటూరు టౌన్‌..: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని సాయిబాబా, దత్తాత్రేయస్వామి ఆలయాలు, వైఎంఆర్ కాలనీలోని సాయిబాబా ఆలయంలో బాబాను శోభాయమానంగా అలంకరించారు. భక్తులు సామూహిక సాయిసత్యవ్రతం ఆచరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. వసంతపేటలోని సాయిబాబా ఆలయంలోని సాయిబాబాను ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీకృష్ణ గీతాశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణుని విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం చేశారు. సాయంత్రం అణఘాదేవి, దత్తాత్రేయ స్వామి కల్యాణం నిర్వహించారు. లైట్‌పాళెం సెంటర్‌లోని కైవల్య సత్సంగ్ ఎంవీఎస్ ధ్యానమందిరంలో కౌవల్యతీర్థస్వామి మాతృశ్రీ జ్ఞానేశ్వరమ్మ గురుపౌర్ణమి ప్రాముఖ్యతను, మోక్షమార్గం భక్తులకు వివరించారు.

ఖాజీపేట..: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని సాయిబాబా గుడి ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవంలో కోలాటం ఏర్పాటు చేయడంతో పలువురు భక్తులను ఆకట్టుకుంది. భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారన్నారు.

ముద్దనూరు..: మండలంలోని ముద్దనూరు, చిన్నదుద్యాల గ్రామాల్లోని సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ముద్దనూరు సాయిబాబా మందిరంలో భక్తుల చేత సాయివ్రతం చేయించారు.బాబా మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం గ్రామోత్సవం నిర్వహించారు.

బద్వేలుటౌన్‌..: గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం సాయినగర్‌లోని శ్రీదత్తసాయిబాబా ఆలయంలో నిర్వహించారు. అనం తరం సాయి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సుమారు 200 మంది రక్తదానం చేశారు. అనంతరం దాతల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయి విద్యానికేతన్ కరెస్పాండెంట్ విజితారెడ్డి, శంకర్‌రెడ్డి, సంజీవ్, జమాల్ వల్లి, విశ్వనాథ్‌నాయుడు, అంజి, సుమన్, సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: బ్రహ్మంగారిమఠంలో వీరబ్రహ్మేంద్రస్వామిని భక్తులు గురుపౌర్ణమి సందర్భంగా అధిక సంఖ్య లో దర్శించుకున్నారు. అలాగే ఈశ్వరిదేవి అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. అలాగే అభయ సాయిబాబా మందిరంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





మైదుకూరు.. కొత్తసాయిబాబా ఆలయంలో సాయిబాబా విగ్రహం, ఖాజీపేటలో కోలాటం వేస్తున్న భక్తులు, బద్వేలులో అన్నదానంలో పాల్గొన్న భక్తులు

కుంకుమార్చన పూజలు



కుంకుమార్చన, పూజలు చేస్తున్న మహిళలు

జమ్మలమడుగు, జూలై 21: జమ్మలమడుగులో వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం ఆషాఢ మాసోత్సవ శాకాంబరిదేవి అలంకారం చేశారు. అమ్మవారికి భక్తులు పూజా కార్యక్రమాలు చేసి మొక్కుకున్నారు. ఉదయం 9.30 గంటలకు 108 పసుపు కొమ్మలతో వాసవీ అష్టోత్తర పూజ నిర్వహించారు. మహామంగళహారతి, ప్రసాద వినిమయం, తదితర పూజా కార్యక్రమాలు చేశారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో విశేషంగా పాల్గొన్నట్లు ఆలయ కమిటీవారు తెలిపారు.

ఘనంగా చండీహోమం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 21: స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం వేద పండితులు గణపతి, నవగ్రహ, ఉపదేవతా చండీహోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధురాలికి ఆపన్న హస్తం



ఎర్రగుంట్ల, జూలై 21: ఎర్రగుంట్లలో అనాథగా ఉన్న ఓ వృద్ధురాలిని ఎర్రగుంట్ల ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తిప్పలూరులోని ఎద్దులపెద్దశేషమ్మ వృద్ధాశ్రమంలో చేర్పించారు. ఆమెకు కావాల్సిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి వృద్ధాశ్రమంలో అప్పగించారు. బాగా చూసుకోవాలని ఆశ్రమ నిర్వాహకులను కోరారు.

టీడీపీ నాయకుడికి పరామర్శ



వేమలూరులో టీడీపీ నాయకుడిని పరామర్శిస్తున్న రితీశ్‌కుమార్‌రెడ్డి

అట్లూరు, జూలై 21: మండలంలోని వేమలూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆదివారం ఆయన నివాసం వద్ద బద్వేల్ యువనాయకులు రితీష్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయనకు వెన్నముఖ దెబ్బతిని సర్జరీ చేయడంతో పరామర్శించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి డబ్బులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వేమలూరులో జరిగిన మొహర్రం సందర్భంగా మండల టీడీపీ నాయకులు ఎం. సూర్యనారాయణరెడ్డి, ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు బి. నందగోపాల్‌రెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, బి. మల్లికార్జునరెడ్డి, పోతిరెడ్డి రెడ్డయ్య, కె. మునిరెడ్డి, బి. అమర్‌నాథరెడ్డి, జయకృష్ణారెడ్డి, ఎం. మహేశ్వరరెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య పి. రాధాకృష్ణారెడ్డి, బ్రహ్మారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎల్.రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా కక్షిదారులైన :- 1) సర్వశ్రీ ఈశ్వర్‌రావు తండ్రి పెద్ద వెంకటరమణా రావు, హిందూ, వయస్సు 74 సం.లు, చిరునామా- డీ.నెం. 12/339, గంగమ్మగుడి వీధి, ప్రొద్దుటూరు మండలం, కడపజిల్లా, 2) సర్వశ్రీ విశ్వనాథరావు తండ్రి కీ.శే. పెద్ద వెంకటరమణారావు, హిందూ, వయస్సు 61, చిరునామా- డీ.నెం. 12/616, కోటవీధి, ప్రొద్దుటూరు, కడప జిల్లా, 3) సర్వశ్రీ వెంకటసుబ్బారావు తండ్రి కీ.శే. యస్.రామచంద్రరావు, హిందు, వయస్సు 49, 4) సర్వశ్రీ అశోక్‌కుమార్ తండ్రి రామచంద్రా రావు, హిందు, వయస్సు 41, సర్వశ్రీ పవన్‌కుమార్ తండ్రి రామచంద్ర రావు, హిందూ, వయస్సు 41, 5) సర్వశ్రీ పవన్‌కుమార్ తండ్రి రామచంద్రరావు, హిందు, వయస్సు25. [illegible] ... 07.09.2022 ... 16/2019 ... [illegible]

ఇట్లు, పి. అక్బర్ అలీఖాన్, అడ్వకేట్, కడప.

బద్వేలు వాసికి డాక్టరేట్

బద్వేలుటౌన్, జూలై 21 : బద్వేలు తాలూకా నందిపల్లె గ్రామానికి చెందిన పంగా సుభాస్కర్‌రెడ్డి రసాయనశాస్త్రంలో డాక్టరేట్ పొందినట్లు అయన తెలిపారు. రసాయనశాస్త్రంలో నోవెల్ నైట్రోజన్ హెటెరోసైక్లిక్ కాంపౌండ్స్ ఆఫ్ బయోలాజికల్ ఇంటరెస్ట్ సల్ఫాక్సిమిన్స్ అండ్ పెరజోల్ (3,4-బి) పిరిడిన్ డెరివెటివ్స్ అనే అంశంమీద చేసిన పరిశోధనలకుగాను మంగళూరు విశ్వవిద్యాలయం నుంచి రసాయశాస్త్రంలో డాక్టరేట్ పట్టా అందుకున్నారు.

వేతనాలు వెంటనే చెల్లించాలి

పోరుమామిళ్ల, జూలై 21: పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ ఆఫీసులో నూతన కమిటీ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి నగేష్, సహాయ కార్యదర్శి ఓబులమ్మ, అధ్యక్షురాలు శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న పెను ప్రమాదం



బి. కోడూరు, జూలై 21: మండల పరిధిలోని కొత్తరోడ్డు బస్ స్టేజీ నుంచి మున్నెల్లి రోడ్డుమీద బద్వేల్‌కు ప్రతి రోజు బస్సులు, స్కూల్ వ్యాన్‌లు, ఆటోలు తిరుగుతూ ఉన్న రోడ్డుకు గోవిందాయపల్లె చెరువుకట్టపై ఇరువైపులా కట్టకు చెట్లు పెరిగాయి. చెరువు కట్ట దాదాపుగా ఆరు మలుపులతో ఉంది. అదే చెరువు కట్టపై నిత్యం ఆటోలు, విపరీతంగా తిరుగుతున్నాయి. వాటితో పాటు మోటార్ బైక్‌లు ఎక్కువగా తిరుగుతుంటాయి. పల్లె వాసులు దాదాపుగా ఇరవై గ్రామాల వారు ఆ రోడ్డుపై పోరుమామిళ్ళకు వెళుతుఉంటారు. ఇప్పటికైనా చెరువు కట్టపై ఉన్న చెట్లను తొలగించాలని లేని పక్షంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు అంటున్నారు.

ఘనంగా మొహర్రం పండుగ




నర్సాపురంలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు, ముద్దనూరులో శెట్టివారిపల్లె వద్ద జాతర పీర్లను దర్శించుకుంటున్న భూపేశ్‌రెడ్డి

కాశినాయన,జూలై21:నర్సాపురం,ఉప్పలూరు, గంగనపల్లె, గొంటువారిపల్లె తదితర గ్రామాల్లో ఆదివారం మొహర్రం పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.ప్రజలు పీర్లచావిడిలో స్వాములకు చదింపులు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు నిప్పుల గుండంలో నడిచారు. నర్సాపురంలో వేర్వేరు పీర్లచావిడిల నుంచి ఊరేగింపుగా బయలుదేరిన పీర్లు,గుమ్మటాలు, బాలరాజు పల్లెకు వెళ్లే మూడురోడ్ల కూడలిలో కలుసుకున్న సందర్భంగా జనసందడిగా మారింది. అనంతరం ఆయాగ్రామాల సమీపంలోని నీళ్ళమడుగులవద్ద పీర్లను శుభ్రపరిచారు. దీంతో పీర్లపండుగ ముగిసినట్లని నిర్వాహకులు తెలిపారు.

జాతర పీర్ల మహోత్సవం

ముద్దనూరు జూలై21: మండల పరిధి మంగపట్నం, శెట్టివారిపల్లె గ్రామాల్లో ఆదివారం ఘనంగా జాతప పీర్ల మహోత్సవం నిర్వహించారు.మంగపట్నం, శెట్టివారిపల్లె గ్రామాల్లోని పీర్లను జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి దర్శించుకోగా, మంగపట్నం జాతర పీర్ల మహోత్సవానికి గౌరవ విశిష్ట అతిథిగా ఏఎస్పీ సుధాకర్ పాల్గొని పీర్లను దర్శించుకున్నారు.మంగపట్నం గ్రామంలో మధ్యాహ్నం 4గంటల నుంచి గ్రామంలో జాతర పీర్లు పెద్దబాబయ్య, చిన్నబాబయ్యను ఊరేగించారు. రాత్రికి విశ్రాంత అధ్యాపకుడు పుల్లారెడ్డిచే నిర్వహించిన పౌరాణిక కార్యక్రమాలు అలరించాయి.అలాగే భజన కార్యక్రమం చేపట్టారు. శెట్టివారిపల్లె గ్రామంలో జాతర పీర్ల మహోత్సవం సందర్భంగా గ్రామ టీడీపీ నాయకుడు లక్ష్మీనారాయణ ఇచ్చిన విందులో భూపేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పోరుమామిళ్లలో గురువులను సన్మానిస్తున్న 1973-74 పూర్వ విద్యార్థులు

పోరుమామిళ్ళ, జూలై 21: దాదాపు యాభై సంవత్సరాల తరువాత ఒకే ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులు అంతా ఒకేచోట కలిశారు. చిన్ననాటి అనుభవాల్ని నెమరు వేసుకున్నారు. పరస్పరం ఒకరికి ఒకరు ఆత్మీయంగా భావాలను నెమరువేసుకున్నారు. పోరుమామిళ్ళలో ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 1973,74 సంవత్సరంలో పదో తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులంతా కలిసి తమ గురువులను సన్మానించుకున్నారు. రిటైర్డు హైకోర్టు ఉద్యోగి పందుగాయల శ్రీనివాసులు, ఇన్‌కమ్‌ట్యాక్స్ రిటైర్డు డిప్యూటీ కమిషనర్ ఎస్ఏ ఫజీరుల్లా, రిటైర్డు పోస్టల్ ఉద్యోగి, నరసింహులు, డీఏ సుబ్బారావు, దుగ్గిరెడ్డి తదితరులు తమ గురువులైన అయిన జయరామిరెడ్డి, గురుమూర్తీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి

ప్రొద్దుటూరు క్రైం, జూలై 21 : రైల్వే స్టేషన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని స్టేషన్ మేనేజర్ భానుప్రకాష్, కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం రైల్వేస్టేషన్‌కు వెళ్లి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు 24 గంటలు అందుబాటులో ఉండేలా చూస్తామన్నారు. టాయిలెట్లు సరిగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్లాట్‌ఫారం పొడిగించడం,ఫ్లోరింగ్ సమస్యలు లేకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేబోర్డు, రైల్వేకన్సల్‌టెన్సీ కమిటీ సభ్యులు బి. భాస్కర్‌రెడ్డి. జీవీ జయలక్ష్మి, గౌరిశంకర్, చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కోట పోలేరమ్మకు ఒడిబియ్యం సమర్పణ



పోరుమామిళ్ళ, జూలై 21: ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకొని పోరుమామిళ్ళలోని కోట పోలేరమ్మ, చౌడమ్మ తల్లికి మహిళలు పసుపు కుంకుమ, ఒడిబియ్యాన్ని సమర్పించి పూజలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం మహిళలు పోలీస్‌స్టేషన్ దగ్గర ఉన్న ఆంజనేయ స్వామి గుడిదగ్గర నుంచి ర్యాలీగా పోలేరమ్మ గుడి వరకు గ్రామోత్సవం నిర్వహించి అనంతరం పూజలు నిర్వహించారు. అలాగే గురుపౌర్ణమి వేడుకలు పురస్కరించుకొని సాయిబాబా దేవాలయంలో పూజలు నిర్వహించారు.

ఘనంగా కేశవనారాయణస్వామి జయంతి



బండలాడుడు పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

బ్రహ్మంగారిమఠం, జూలై 21: మండలంలోని పలుగురాళ్ళపల్లి పంచాయతి బాకరాపేట గ్రామం సద్గురు కేశవనారాయణస్వామి 125వ జయంతిసందర్భంగా ఆలయ ప్రాంగణంలో సీనియర్ కేటగిరి ఎద్దులకు బండలాగుడు పోటీలను చేపట్టారు. ఈ మేరకు ఆదివారం బండలాగు పోటీలను టీడీపీ మండలాధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి కింద మైదుకూరు నియోజకవర్గం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రూ.లక్ష రూపాయలు ప్రకటించారు. మొదటి విజేతకు ఎమ్మెల్యే తరుపున మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి లక్ష నగదును అందజేశారు. తిరుమల నాగయ్య, మేకల సుధాకర్, సుబ్బయ్య, చిలమల నాగయ్య టీడీపీ నేతలు పాల్గొన్నారు.